కథా నిలయం
శ్రీకాకుళం

# రామరాజు

" రామ ! రామ ! నేను అబద్ధం చెప్పడం లేదండి బాబు ! నిజంగా నాకు తలనెప్పి తగ్గింది." తలమీద చెయ్యిపెట్టి చెప్పాడు నాగరాజు.

నేను నమ్మలేక పోయాను. నాగరాజు మా కాలనీలో ఉంటాడు. అతన్ని చూస్తే నాకు నిత్య దుఃఖితులు గుర్తుకొస్తారు. మనిషి చాలా సీరియస్సుగా ఉంటాడు. నవ్వు ముఖం ఎరుగని వాడిలా మొహం చిట్లించి ఉంటాడు.

" జీవితంలో అంత సీరియస్సుగా బాధపడాల్సిన విషయాలు ఏమున్నాయి? నీకు డబ్బు లేదా - అయితే అత్యధికులలో నువ్వొకడివి ! నీకు మరణభయం ఉందా - సంతోషించు - ఈ పాడులోకంలో కలకాలం జీవించనందుకు జీవితకాలం శిక్ష అనుభవించే జైలు పక్షి కంటే - హఠాత్తుగా మరణించే నిందితుడే అదృష్టవంతుడు. కొంచెం నవ్వడం నేర్చుకో గురూ అప్పుడప్పుడు నాగరాజుకు క్లాసు తీసుకునే వాడిని.

అతను బలవంతాన ' హి హి హి' అనేవాడు వెకిలిగా.

" చూడు నాగరాజు ! ఇన్ని లక్షల జీవరాశుల్లో భగవంతుడు నవ్వే శక్తి ఒక్క మానవుడికి మాత్రమే ఇచ్చాడు. ఏడ్చే శక్తిమటుకు అన్ని జీవరాశులకు యిచ్చాడు. అటువంటి అరుదైన వరాన్ని నీలాంటి వాళ్ళు దుర్వినియోగం చేసుకుంటున్నారు - జంధ్యాల గారన్నట్లు నవ్వడం ఒక భోగం నవ్వించడం ఒక యోగం, నవ్వకపోవడం ఒక రోగం ! నవ్వితే ఎన్నో ముఖకండరాలకు వ్యాయామం కలుగుతుంది - తద్వారా మన ఆరోగ్యం మెరుగవుతుంది."

" చూడు రాము, నా మొహం గురించి నీకెందుకు గాని - నాకు ఎప్పుడూ తలనొప్పి ఉంటుంది - అందుకే మొహం చిట్లిస్తాను" అతను బాధపడుతూ చెప్పేవాడు.

" అస్సలు విజ్ఞానం ఇంతగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో తలనెప్పి ఒక సమస్య గాదు. ఏ డాక్టరు దగ్గరికి పోతే ఏదో ఒక ట్యాబ్లెట్టు రాసిస్తాడు తగ్గడానికి" ఒక సారి అతగాడ్ని హెచ్చరించాను.

దానికి నాగరాజు తన మొహాన్ని మరింత విషాదంగా పెట్టి చెప్పాడు "అన్నీ అయిపోయాయి - కర్నూలు లోని డాక్టర్లందరూ మా వల్ల కాదని చేతులు ఎత్తేశారు-" అభినయించాడు

" హూ ! లోకం గొడ్డుపోయిందా - ఇంక డాక్టర్లే లేరా ఆంధ్రలో ?"

" ఆ ! అదీ అయింది. హైద్రాబాద్ అంతా తిరిగాను - ఆఖరికి నిమ్సులో కూడ

చేయించుకున్నాను - చివరికి ఈ ఇంగ్లీషు డాక్టర్లు తేల్చిందేమంటే నేనొక మానసిక రోగినట ! అందుకే లేని తలనెప్పిని నటిస్తున్నానట ! చూడు రాము - నా ఆర్థిక పరిస్థితి నీకు తెల్సు - లేని జబ్బు కోసం నేను లక్షల రూపాయలు ఎందుకు ఖర్చు పెడతాను - నాకేమన్నా సర్దానా ?" అంటూ తను ఎక్కడెక్కడ ట్రీట్‌మెంటు తీసుకుంది - కాని ఇసుమంతైనా నయం కాని సంగతులు పూసగుచ్చినట్లు చెప్పాడు నాగరాజు.

అప్పుడు నేను మొదటిసారిగా నాగరాజు పైన జాలి పడ్డాను. చూసే వారికి చాలా చిన్న సమస్యలాగుంటుంది అది. కాని అనుభవించే వాళ్ళకు తెలుస్తుంది.

" పోనీ హోమియో - ఆయుర్వేదం లాంటివి ప్రయత్నించాల్సింది". ఉచిత సలహా యిచ్చాను. ఆల్టర్నేట్ మెడిసిన్ పైన నాకు నమ్మకం జాస్తి !

" ఓ ! అవి కూడ నాకు ఉపశమనం కలుగ చెయ్యలేక పోయాయి. నాగరాజు నిట్టూర్చాడు. జీవితంలో తనను ఎవ్వరూ బాగు చెయ్యలేరన్నట్లు మొహం పెట్టాడు.

ఇవన్నీ జరిగి కొన్ని నెలలు పైన అయింది. అతగాడు డాక్టర్ల చుట్టూ తిరగబట్టి పదిహేను సంవత్సరాలు దాటింది. అటువంటి తలనెప్పి తగ్గిందంటే నాకు నిజంగా తలతిరిగింది.

" అస్సలు నువ్వు డాక్టర్లను కలవడం మానుకున్నావు గదా ఈ మధ్య - మరి ఎలా తగ్గింది?!" ఆశ్చర్యంగా అడిగాను దాన్ని ఎనిమిదో వింతలా భావిస్తూ.

" ఒక మహానుభావుడు ఒకే ఒక్క డోసుతో తగ్గించాడు" చెప్పాడు.

" ఆ ! నిజంగా ! అతనికి ఎన్ని వేల రూపాయలు చెల్లించావేంటి?"

" సారీ, ఒక్కరూపాయి కూడ యివ్వలేదు. ఇస్తానన్నా అతను తీసుకోలేదు - మీకు తగ్గితే నాకు సంతోషం అన్నాడు". నాగరాజు తాపీగా చెప్పాడు. నేను ఉండబట్టలేక విషయం సంగ్రహించాను.

అసలేం జరిగిందంటే నాగరాజు ఆఫీసు కాన్ఫరెన్సుకు శ్రీశైలం వెళ్ళాడుట! అక్కడ చాలామంది వచ్చారుట ! యాదృచ్ఛికంగా అక్కడకు హాజరయిన రామరాజు గారు నాగరాజుతో పరిచయం పెంచుకున్నాడట ఆ సాయంకాలం అడిగాడుట.

" సారీ గురువు గారు - ప్రొద్దుటినుండి మిమ్మల్ని గమనిస్తున్నాను. అందరూ నవ్వుతూ ఉంటే మీరు మటుకు మొహం అదోలా పెట్టుకుని కూర్చున్నారు - ఇక్కడికి రావడం మీ కిష్టం లేదా?" రామరాజు కుతూహలం కొద్దీ అడిగాడు నాగరాజును.

" అబ్బెబ్బే ! అదేం కాదు - నాకు తలనెప్పిగా ఉంటుంది " నాగరాజు తడబడుతూ చెప్పాడు తలపట్టుకుని.

" ట్యాబ్లెట్సు వాడ్డం లేదా?"

" ఓ ! అవినాకు పనిచెయ్యవు "

" నిజంగా – "

" ఆ ! బజారులో దొరికే మాత్రలన్నీ వాడేశాను – అవి యాక్షన్ చెయ్యలేదు కాని రియాక్షన్ మటుకు చేస్తున్నాయి. నయం గాని జబ్బును వినయంగా వయనంగా భరించాలి ! అందుకే ప్రస్తుతం ఏ మందులూ వాడటం లేదు" అంటూ నాగరాజు తన తలనెప్పి చరిత్ర చెప్పుకొచ్చాడు.

రామరాజు అంతా విని చిన్నగా నవ్వాడు.

" రాజు గారు ! నేను మందిస్తాను – తీసుకుంటారా !"

" మీరా – మందా ? ఎన్ని రోజులు ? అయినా మీరు లైబ్రేరియన్ కదా! మీరు – మందులివ్వడం ఏంటి?" అతనికి ఆశ్చర్యం కలిగింది.

" నాకిదొక పిచ్చి ! ఎన్నో రోజులు అక్కరలేదు – ఒక్కరోజు వాడండి – తగ్గక పోతే మానండి – నా మందు పనిచేస్తే పని చేస్తుంది లేకపోతే మర్యాదగా తప్పుకుంటుంది. నో రియాక్షన్ !" చెప్పాడు రామరాజు. " ఓన్లీ యాక్షన్ !"

నాగరాజుకు అతనిపైన జాలి కలిగింది – అతని దుస్తులు అతని వాలకం చూస్తే ఆర్థికంగా చాలా అవస్థలు పడుతున్నట్లున్నాడు – చాలా అమాయకంగా ఉన్నాడు – తను ఎన్నో మందులు వాడి ఉన్నాడు.

తన తలనెప్పి తనతోనే అంతమవుతుందని నిర్ణయానికి వచ్చినవాడు తను – అతని మందు వాడటం ఏంటి.

"ఏంటి ఆలోచిస్తున్నారు? అడిగి మరీ మందిస్తాను అంటే అనుమాన పడతున్నారా? నేను మిమ్మల్నేదో మోసం చేసి మీ ఆస్థి దోచుకుపోతానను కుంటున్నారా? మందులు, మాకులు పెట్టే వాడిలా కనిపిస్తున్నానా?" రామరాజు నొచ్చుకుంటూ అన్నాడు.

నాగరాజుకు జాలి కలిగింది తలూపాడు " అదేం కాదు, నా దురదృష్టాన్ని మీరు చాలా తేలికగా చూస్తున్నారు మహామహులు వైద్యం చేశారు – విఫలమయి పోయారు– అటువంటిది ధైర్యం చేసి మీ లాంటి వాళ్ళు యిస్తాననడం నాకు ఆనందంగా ఉంది ఇవ్వండి – తప్పకుండా తీసుకుంటాను – మందుల పేరుతో ఎన్నో భయంకరమైన విషాలు యిస్తున్న డాక్టర్ల కంటే మీరు మంచివారనే నా నమ్మకం ! మీ తృప్తి కోసం యివ్వండి". రామరాజును నిరుత్సాహ పరచడం యిష్టం లేక నాగరాజు ధైర్యం చేశాడు, తనకు ఏ మాత్రం నమ్మకం లేకపోయినా.

రామరాజు కాన్ఫరెన్సు తరువాత వెళ్ళిపోయాడు. ఆ రాత్రికి తిరిగి వచ్చాడు. చేతిలో చాలా చిన్న సీసాతో వచ్చాడు.

"చూడండి – అరగ్లాసు నీళ్ళల్లో మూడు చుక్కలు వేసుకుని పడుకోండి – తెల్లారి లేచింతర్వాత – " రామరాజు చెబుతున్నాడు సీరియస్సుగా.

" అస్సలు తెల్లారుతుందంటారా? లేస్తానా ?" తమాషాగా అడిగాడు నాగరాజు.

" ఆ ! అప్పుడు నేను మళ్ళీ వచ్చి కల్సి మీకు చెబుతాను" రామరాజు కొంచెం బాధపడ్తూ వెళ్ళిపోయాడు.

నాగరాజు భయపడుతూనే మూడుచుక్కలు నీళ్ళల్లో కలుపుకుని తాగి పడుకున్నాడు. అలసి పోవడం వలన గాఢనిద్రపోయాడు నాగరాజు.

" గుడ్‌మార్నింగ్ ! బాగున్నారా?" అంటూ ఉదయం రామరాజు వచ్చి పలకరించే టప్పటికి గాని రాత్రి తను మందు తాగినట్లు అతనికి గుర్తు రాలేదు.

నాగరాజు తలకాయను చాలా సార్లు విదిలించాడు.

" ఏమైంది ?" కుతూహలంగా అడిగాడు రామరాజు.

" అరే ! నా తలనెప్పి ఏమయింది ?" ఆశ్చర్యంగా అడిగాడు నాగరాజు.

" మీరే చెప్పాలి – తగ్గిందా?" రామరాజు ఆతృతగా అడిగాడు.

" ఆ ! ఆశ్చర్యంగా చిన్న పిసరంత కూడ లేదు. యు ఆర్ గ్రేట్ !" నాగరాజు అభినందించాడు " చేత్తో తీసేసినట్లు నా తలనెప్పి తగ్గింది."

అలా శ్రీశైలంలో నాగరాజుకు రామరాజుతో పరిచయం ఏర్పడిందట. ఖాళీ సమయాల్లో మూలికావైద్యం చేస్తాడట !

నా కనిపించింది – అస్సలు యితనికి తలనెప్పి ఉంటే గద తగ్గడానికి – అతనేదో మాయచేసి ఉంటాడు – అందువల్లనే తగ్గిందనుకున్నాడు అని ..... ' పాపం పిచ్చోడు!' అని జాలిపడ్డాను నాగరాజును చూసి.

కాని ఆ తర్వాత అప్పుడప్పుడు నాగరాజు నవ్వడం గమనించాను.

ఓ రోజు హఠాత్తుగా నాగరాజు చెప్పాడు హడావిడి పడ్తూ వచ్చి.

" రాము ! నువ్వు కూడ వస్తావా? శ్రీశైలం సత్రానికి ?" తొందర పెట్టాడు.

" ఎందుకు ? పురాణ కాలక్షేపం ఉందా?" మొహం చిట్లించాను.

" కాదు – రామరాజు క్యాంపు వేశాడు – నయం కాని దీర్ఘవ్యాధుల్ని నయం చేయడం కోసం వచ్చాడు – షగరు – అస్తమా – లాంటి మొండి వ్యాధుల్ని క్యూర్ చేస్తాడట !" వివరించాడు నాగరాజు నాకు.

" నిన్న రాత్రి శ్రీశైలం నుండి వచ్చాడుట !" అంటూ రామరాజు క్యాంపు కొచ్చిన వైనం చెప్పుకొచ్చాడు.

నాకు నమ్మకం లేదు గాని – రామరాజు సత్తా తెలుసుకుందామనిపించి నాకు

తెల్సిన ముగ్గురు, నలుగురు రోగులను పంపించాను.

ఆ సంగతి నేను మర్చిపోయాను - కాని మూడు వారాల తర్వాత నేను పంపించిన రోగులు నాకు కృతజ్ఞతలు తెలియచేశారు - ఒకడికి అస్తమా బాగా తగ్గిందిట - ఇంకొకతనికి షుగరు పూర్తిగా తగ్గి - స్వీట్లు తింటున్నా షుగరు లెవెలు పెరగడం లేదుట. ఇంకోతనికి ఎప్పటికీ తగ్గని చర్మ వ్యాధి తగ్గిందట !

దేశంలో యింతమంది మానసిక రోగులున్నారా ? అని అనిపించింది కాగా అప్పుడనిపించింది - ఎంతో కాలంగా మా అమ్మగారు మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్నది - ఇక్కడి డాక్టర్లు శస్త్ర చికిత్స చేసి మూత్ర పిండాల మార్పిడి చేయాలన్నారు - కాని అది చాలా రిస్కుతో కూడుకున్న పని - ఆమె ఆరోగ్యం - ఆమె వయసు దృష్ట్యా అంత సాహసించదగ్గ విషయం కాదు. పైగా ఆర్థిక పరిస్థితి ఏమాత్రం సంతోషజనకంగా - సాహసించేట్లుగా లేదు.

ఆ జబ్బు వలన ఒక్కొక్కసారి ఆమెకి ఉధృతంగా 106$^0$ డిగ్రీల జ్వరం ముంచుకొచ్చేది. ఎంత తీవ్రంగా చలి జ్వరం వచ్చేది అంటే ఆ సమయంలో ఎన్ని దుప్పట్లు కప్పినా ఆగేది కాదు. మూలుగుతూ మూలుగుతూ మంచంమీంచి కింద పడుతుందాన్నంత భయం వేసేది. ఆజ్వరం రాగానే వెంటనే ఇంజెక్షన్ అన్నా పడాలి ! అర్థరాత్రికాని - అపరాత్రికాని - ఏ నర్సునో - డాక్టరునో పట్టుకొచ్చి యింజెక్షన్ యిప్పించాలి. ఇలా నెలలో రెండు మూడు సార్లు ఆమె బాధపడేది. ఆజ్వరంలో మా అమ్మగారు పడే బాధ చూస్తే - ఆ జబ్బు శత్రువులకు కూడ రాకూడదని భగవంతుడ్ని ప్రార్థించేవాళ్ళం మేమందరం.

ఒక వేళ రామరాజుకు చూపిస్తే కొంత తృప్తి మానసికంగా అన్నా కలుగు తుందేమోనని - నాగరాజును ప్రార్థించాను రామరాజును ఒక రోజు మా యింటికి తీసుకురమ్మని. మా నాన్నగారు కూడ పలుమార్లు బ్రతిమాలారు అతన్ని.

మాయింటి కొచ్చిన అతన్ని చూసి ఆశ్చర్యపోయాను. అతి సాధారణంగా ఉన్నాడు. చాలా సింపుల్‌గా - మందహాసంతో - కొంచెం కురచగా - యాసతో మాట్లాడుతూ ఉంటాడు. అతనిది విశాఖపట్నం వైపుట - అక్కడ అడవుల్లో ఎన్నో వనమూలికలు సేకరించాడట ! శ్రీశైలంలో మంచి మూలికలు దొరుకుతాయని బదిలీ మీద యిటు వైపు వచ్చాడట.

తరతరాలుగా ఆయన వంశంలో మూలికా వైద్యం ఉందిట ! కాని రామరాజు దాన్ని మరింత ముందుకు తీసుకుపోయాడట. తనకు ఆయుర్వేదంతో పాటు - హోమియో వైద్యం కూడ బాగా వచ్చుట అందుకని ఆయుర్వేదంలో ప్రాచీన గ్రంథాలలో రాసిన

మూలికల్ని సేకరించి వాటిని ఆధునికంగా - హోమియోలో మందులు తయారు చేసినట్లు తయారు చేసి ప్రయోగిస్తాడట. ఏ పుస్తకాలలో రాయని ఎన్నో ప్రయోగాలు చేశాడట. అవన్నీ తన డైరీల్లో భద్రపరుస్తున్నాడట. తన దగ్గరున్న విషయాలను గ్రంథస్థం చేసి ప్రచురించాలని ఆయన కోరికట. తద్వారా మానవాళికి ఉపకారం చేయాలట !

పెద్ద పెద్ద ప్రొఫెసర్లు - లక్షలు జీతాలు తీసుకునే శాస్త్రజ్ఞులే ఏమీ చేయలేక పోతూంటే - బ్రతకలేక బడి పంతులు లాగా ఓ పాలిటెక్నిక్ కాలేజీలో లైబ్రేరియన్‌గా పని చేస్తున్న రామరాజు మటుకు - తన జీతంలో సగం డబ్బులు తన సగం జీవితం తన ప్రవృత్తి కోసం - మందుల సృష్టికోసం ఖర్చు పెట్టడం నన్ను ముగ్ధుడ్ని చేసింది. రీసెర్చి కోసం ఏటా వందల కోట్లు రిలీజు అవుతున్నా అవన్నీ మేథావులని చెప్పుకునే వారు మేతావుల్లాగా మేయడానికి సరిపోతున్నాయి కాని ప్రజల వుపయోగంలోకి రాలేక పోతున్నాయి. అటువంటిది ఎంతో ఆర్థిక యిబ్బందుల్లో వున్న రామరాజులాంటి ఒక సామాన్యుడు నిస్వార్థంగా మానవళి కోసం తన కాలాన్ని - ధనాన్ని పిచ్చివాడిలాగా వ్యయం చేయడం నన్ను ఆకర్షించింది.

మా అమ్మకు కబుర్లంటే ప్రాణం - మనుషులంటే మరీ ప్రాణం ! ఒక సారి ఆమెతో మాట్లాడితే మాట్లాడిన వాడు ఆమెకు ఆత్మీయుడై పోతాడు మనుషుల్లోని మంచిని నమ్మే పిచ్చి మనిషి ఆమె - వచ్చిన వాళ్ళకు అన్నపూర్ణలా అతిథి మర్యాదలు చేస్తుంది. తను మంచం మీద వున్నా లోకం గురించి - తమ స్నేహితుల గురించి ఎప్పుడూ ఆలోచిస్తూంటుంది. తన వాళ్ళకు అతిథి మర్యాదలు పురమాయిస్తూంటుంది.

అందువల్ల పది రోజుల కొక సారి శ్రీశైలం నుండి వస్తూ మందులు తెచ్చి ప్రజల కిస్తూ ఉండే రామరాజు, అమ్మను కూడ చూసి మందులు యిస్తూ ఉండేవాడు ఆప్యాయంగా.

ఒక నెల గడిచే సరికి ఆమె ఒక్క యింజెక్షను కూడ తీసుకోలేదు. ఎప్పుడూ చెప్పే కంప్లెయింట్లు కూడ చెప్పడం లేదు. ఆమెలో నూతనోత్సాహం చూశాము. లేచి చక్కగా పనులు చేయగలుగుతున్నది.

" నా మందులు మీ చెడిపోయిన కిడ్నీని కూడ తిరిగి బాగు చేస్తాయి " రామరాజు అనేవాడు. " మళ్ళీ పూర్వం లాగా పనిచేసేట్లు చేస్తాయి."

" కిడ్నీని ప్రపంచంలో ఎవరూ బాగు చెయ్యలేరని డాక్టర్లు అంటారు "

" వాళ్ళకు తెల్సిన విజ్ఞానం అంతే ! ప్రపంచంలో కెల్లా మన ఆయుర్వేదం అతి ప్రాచీనం - ఆ కాలంలోనే అన్ని జబ్బులకు మందులు కనుక్కొని సమర్థవంతగా వాడేవారు. అమూల్యమైన ఎన్నో గ్రంథాలు లుప్తమై పోయాయి. దొరికిన వాటిల్లో కూడ కొన్ని

మూలికలను మనం గుర్తించలేక పోతున్నాం - పైగా మన మూర్ఖత్వం వలన అపార మూలికా సంపద కూడ నశించి పోతున్నది. జనాలు పెరిగిపోయి - అరణ్యాలను నరికి యిళ్ళు నిర్మించుకోవడం వలన - ప్రాజెక్టులు కట్టి ఎన్నో వేల ఎకరాల అటవీ సంపదను జలాల్లో కలిపి వేయడం వలన - ఈ వాతావరణ కాలుష్యం వలన - మనకున్న అతి విలువైన ప్రాచీన ఔషధ వృక్ష సంపద నశించి పోతున్నది. ఆంగ్లేయ వైద్యం మోజులో పడి ప్రజలు మన సాంప్రదాయ వైద్యాన్ని తిరస్కరించారు. ఆయుర్వేదానికి ఆదరణ లేక - ఆయుర్వేద వైద్యులు కూడ ఇంజెక్షన్లు యిచ్చుకుంటూ బ్రతుకులు భారంగా యీడుస్తున్నారు. అంటూ రకరకాల కబుర్లు చెప్పేవాడు.

మా అమ్మ ఊరుకోకుండా ఆయనతో వాదనకు దిగి ఆయనలో నిక్షిప్తమైన ఎన్నో గొప్ప సంగతులు బయటకు లాక్కొచ్చేది. ఆయన విజ్ఞానానికి మేము ఆశ్చర్యపోయే వాళ్ళం ! ఆయన పరిశోధనలకు జోహార్లు అర్పించేవాళ్ళం!

ఒక ఆరు నెలల్లో మా అమ్మకు కిడ్నీ జబ్బు లేదు - బాగా తగ్గిపోయింది, డాక్టర్లు సూచించినట్టు ఏ ఆపరేషన్ చేయకుండానే . ఇంగ్లీషు మందులు మాని వేసింది కూడ. అయినా చాలా బాగుంది.

కర్నూలులో చాలా మంది రోగులు మొండి జబ్బుల నుండి బయటపడ్డారు రామరాజు దయవలన.

కొందరు మధుమేహం రోగులు పూర్తిగా నయం చేయబడ్డారు. షుగరు క్యూర్ చేసే మొగాడు పుట్టాడనిపించింది ఈ భూమిలో.

నాకు జలుబు వస్తే తగ్గదు. ఒకసారి ఆయనకు ఆ విషయం చెప్పాను. జలుబు చేయంగానే. వెంటనే ఒక చిన్న సీసా యిచ్చి కొన్ని చుక్కలు నీళ్ళల్లో వేసుకుని పడుకోమన్నాడు రామరాజు.

అద్భుతంగా మరునాటికి నా జలుబు మాయమైంది. ఒక సారి జలుబు చేస్తే తగ్గడానికి ఎన్నో యాంటీ బయాటిక్కులు - మాత్రలు వాడితే కాని నాకు పదిహేను - యిరవై రోజులకు తగ్గని జలుబు ఒక్క డోసుకే తగ్గిపోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆయన శక్తి సామర్థ్యాల పైన నమ్మకం కలిగించింది.

రామరాజు గార్కి ఒక గొప్ప జ్యోతిష్కుడ్ని పరిచయం చేశారు మా నాన్నగారు రామరాజుకు కూడ జ్యోతిష్యం - హస్త సాముద్రికం తెలుసు - కాని నాన్నగారు పరిచయం చేసిన స్కందస్వామి ప్రొఫెషనల్. చాలా గొప్పవారు

" సార్ ! నా జీవితాశయం ఒక్కటే ! శ్రీశైలంలో అతి పెద్ద మూలికా రీసెర్చి సెంటరును స్థాపించాలని. ప్రపంచంలోని నలుమూలల నుండి రోగులు వచ్చి అక్కడ

స్వస్థత పొందాలి ! శ్రీశైలం పేరు - నా పేరు ప్రపంచ వ్యాప్తంగా మారుమోగాలి. శ్రీ సత్యసాయి బాబాగారు పుట్టపర్తిలో కట్టినట్లు గొప్ప వైద్యశాలను స్థాపించి - ప్రపంచానికి భారతదేశ సాంప్రదాయ వైద్య గొప్ప తనాన్ని నిరూపించాలి. అక్కడ రోగులకు ఉచితంగా వైద్యం చెయ్యాలి. కాకపోతే జబ్బు తగ్గించుకున్నవారు వారి యిష్టం కొద్దీ వారికి తోచినంత డొనేషన్లు యివ్వవచ్చు. ఇప్పటికే నేరాసుకున్న నోట్సు- నాకు తెల్సిన మందులు - బడా బడా బహుళ సంస్థలకు అమ్ముకుంటే కోట్లు సంపాదించగలను. కాని నా కది ఇష్టం లేదు. వైద్యం పేదలకు అందాలి ! ఆపన్నులకు నా సేవలు అందాలి ! అందుకే పోరాడుతున్నాను. కాని నా కొడుక్కి ఉద్యోగం వచ్చే అవకాశం లేదు. అందుకే నేను స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసి నా కొడుక్కి ఉద్యోగం వేయించి ఈ మూలికా పరిశోధనల కోసం నా జీవితాన్ని అంకితం చేస్తాను" ఎంతో ఆవేశంతో రామరాజు చెప్పాడు.

"నాకో సందేహం. మీరొక కొత్త మందు కనుక్కున్నారనుకోండి - దాని యాక్షను, కాని రియాక్షను కాని ఎలా పరిశీలిస్తారు - మీ మందును ఎలా నిరూపిస్తారు? మీ దగ్గర డబ్బుల్లేవు కాబట్టి లక్షలకు లక్షలు యిచ్చి కిరాయికి మనుషుల్ని తీసుకువచ్చి వారిపైన ప్రయోగించి మందును పరీక్షించలేరు కదా ?" స్కందస్వామి అడిగాడు అతని జాతకాన్ని పరిశీలిస్తూ .

"అందుకే ఎవరన్నా వాలంటరీగా వస్తే వాళ్ళకిస్తాను. కాని అందరికంటే ముందు నేను కనిపెట్టిన మందును ముందుగా నా పై ప్రయోగం చేసుకుంటాను. దాని లక్షణాలను రాసుకుంటాను. దాన్ని బట్టి మరికొంత మార్పులు చేర్పులు చేస్తాను. కాని ఇలాంటి ప్రయోగాలతోనే నా ఆరోగ్యం కూడ దెబ్బతింటున్నది." రామరాజు విశదీకరించాడు తన రిసెర్చి విధానాలను.

అప్పుడు నా కనిపించింది రామరాజు జీనియస్సు అని ! జీనియస్సు ఈజ్ నథింగ్ బట్ వన్ పర్సంట్ ఇన్స్పిరేషన్ - నైన్‌టి నైన్ పర్సెంట్ పెర్స్పిరేషన్ ! బహుముఖ మేధావి అనగా ఒక శాతం ప్రేరణతో తొంబై తొమ్మిది శాతం కష్టించి చెమటోడ్చి పనిచేసేవాడు.

నిజంగా భారతదేశం యొక్క దురదృష్టం ఏమని వర్ణించాలి ! అనురక్తి - ఆసక్తి ఉన్న వాళ్ళకు సరియైన ఆర్థిక స్తోమత ఉండదు. ఆర్థిక స్తోమత ఉన్నవాళ్ళకు అనురక్తి - ఆసక్తి ఉండవు అన్ని వసతులు వున్నవాళ్ళు నిరాసక్తిగా భుక్తికోసం పరిశోధనలు చేస్తూ ఐరావతంలా తయారవుతూ ఉంటారు. రామరాజు లాంటి స్వయం ప్రకాశుల్ని ప్రభుత్వం గుర్తించదు. గుర్తించి ఆర్థిక సహాయం అందించదు. కనీసం ప్రజల నుంచి కూడ అతనిలాంటి వారికి వెన్నుదన్నులుండవు. ప్రజల మాట అటుంచి అటువంటి మేధావులకు యింటిలో

సహకారం కూడ లభించదు.

" ఇంటిలోని పోరు యింతింత కాదయా " అంటూ రామరాజు తన సహచరిణి తన పిల్లాడి జాబు కోసం - ఆర్థిక సమస్యలకోసం వేధించే వేధింపులు వర్ణించేవాడు. ఆయనకి సగం సమస్య ఇంటి పరిస్థితి.

ఏమీ పరిశోధనలు చేయకుండా - యితరులతో చేయించి - పరిశోధనా వ్యాసాలను తమ పేరుమీద ప్రచురించుకుని - అచిర కాలంలోనే ప్రభుత్వం దృష్టిలో పడిపోయి అందలాలు ఎక్కేవాళ్ళు - తిమ్మిని బొమ్మని, బొమ్మని తిమ్మిని చేసి ప్రజలకు ఉపయోగపడని సిద్ధాంతాల రాద్ధాంతాలు తయారు చేసి నోబులు ప్రైజల లాంటి ప్రైజులు తీసుకునే వాళ్ళు - ఎవరో కష్టపడి కనుక్కున్న విషయాలను తస్కరించి మేథావులుగా వెలిగి పోతున్న ప్రముఖులు - మసలుతున్న భారతీయ సమాజంలో రామరాజులాంటి నిస్వార్థ ప్రయోగశీలులకు - సమాజసేవకులకు గుర్తింపు వచ్చే రోజు వస్తుందా? అదే అతన్ని బాధిస్తున్న ప్రశ్న.

" రామరాజు గారు ! డోంట్ వర్రీ - జాతకంలో చిన్న చితకా ఆటంకాలు - గండాలు ఉన్నాయి. కాని అవన్నీ మీరు అధిగమిస్తారు - మీకు ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రతిష్టలు వచ్చి తీరతాయి !" స్కంధస్వామి తేల్చి చెప్పాడు - అతని జాతకాలను పరిశీలించి.

రామరాజు పరమానంద భరితుడై ఆ స్వామికి భారీగా రొక్కం యిచ్చాడు.

జనరల్ హాస్పిటల్లోని కొందరు చీఫులకు - పెద్ద పెద్ద ప్రొఫెసర్లకు పరిచయం కాబడ్డాడు రామరాజు - వారు కూడ వారికి లొంగని వ్యాధులు కలిగిన రోగులను అప్పచెప్పారు.

రామరాజు వారి అనుమతితో, వారిపైన తన మందులు వాడి చాలా మంచి ఫలితాలు సాధించాడు.

రోజులు ఎప్పుడూ ఒక్కలాగా సాగవు.

రామరాజు అబ్బాయికి ప్రభుత్వం ఉద్యోగం వచ్చింది. రామరాజు స్వచ్ఛంద పదవీ విరమణ చేసి తన కుమారుడికోసం తన ఉద్యోగం వదులుకున్నాడు. అందుకోసం అంతటి మహా వైద్యుడు తను ఉద్యోగం చేయడానికి వైద్య పరంగా అనర్హుడని ప్రకటించుకోవలసి వచ్చింది. విధి బలీయం !

ఇంటిలోని పోరుతో తన స్వస్థలంకు వెళ్ళిపోయాడు.

ఒకప్పుడు ఉత్తరాది వాళ్ళకు ఆంధ్రఉన్నట్లుగా తెలియదు - అందరిని మద్రాసీలనే వాళ్ళు- అలాగే రాయలసీమ వాళ్ళకు ఉత్తరాంధ్ర విశాఖపట్నం జిల్లాలు - గోదావరి జిల్లాలు తెలియవు - సర్కారోళ్ళు అనేస్తారు. అంత సువిశాలమైన సర్కారులో రామరాజు

ఊరు మాకు సరిగా తెలియలేదు.

కొన్ని నెలల తర్వాత రామరాజు కర్నూలును దర్శించాడు. తన రీసెర్చి గురించి - తను సాధిస్తున్న ప్రగతి గురించి చెప్పాడు తను క్యాంపులు పోయి రోగులకు చేస్తున్న సేవలు వివరించాడు. తిరిగి కర్నూలుకు క్రమం తప్పకుండా మందులు యివ్వడానికి వస్తానని ప్రామిసు చేశాడు. అందుకోసం పేషంట్లను వెతికి పట్టమని చెప్పాడు, మానాన్న గార్కి.

తను క్యాన్సరును కూడ క్యూర్ చేసే మందు కనుక్కుంటున్నట్లు చెప్పాడు. తన ఊరుకు పోయింతర్వాత తనకు మనశ్శాంతి లేదని చెప్పాడు. శ్రీశైలం తనకు చాలా బాగుండేదని చెప్పాడు అక్కడ దొరికినట్లు మంచి మూలికలు తనకు యింకెక్కడా లభించట్లేదని చెప్పాడు.

నాగరాజు - నేను తిరిగి దీర్ఘవ్యాధుల రోగులను సమీకరించ సాగాము.

తను రాస్తున్న నోట్సు కూడా పూర్తయి పోయిందని దాన్ని ప్రచురించే ఏర్పాట్లు చేసి ప్రపంచానికి మేలు చేకూర్చమని విజ్ఞప్తి చేశాడు.

తన స్వగ్రామం వెళ్ళిపోయింతర్వాత రామరాజులో మునుపటి చురుకుదనం కానరావడం లేదు. చిరునవ్వు కరువైంది.

ఏదో పోగొట్టుకున్నట్లు బాధపడుతున్నాడు.

" నేను వీఆర్ఎస్ తీసుకుని చాలా పొరపాటు చేశాను" చాలా బాధపడ్డాడు రామరాజు.

మాకు అర్థమయింది. ఆయన యింటి సమస్యలతో బాధపడుతున్నాడని. అంతటి మేధావికి - సామాజిక సేవకుడిగ - ఇంటిలో తగిన ఆదరణ - ప్రోత్సాహం కరువైందని గ్రహించాము. జాండిసు గురించి - ఆస్తమా గురించి - మెంటల్ కేసుల గురించి ఎన్నో కొత్త విషయాలు చెప్పాడు.

శ్రీశైలంలో దొరికే నిధుల గురించి - పరసువేది చెట్టు గురించి చెప్పుకొచ్చాడు. ఆ పరసువేదికి ఇనుము తాకిస్తే బంగారంగా మారతుందిట !

కొండ దొరలు - కోయదొరలు యిచ్చే మూలికల గురించి చెప్పాడు. శ్రీశైలంలో తను స్థాపించబోయే ఆసుపత్రి గురించి వివరించాడు. తాను గీసుకున్న ప్లాను కాగితం కూడ చూపించాడు.

కాని దూరాభారం అయిపోయిందని విలపించాడు. తన ఊరు నుండి కర్నూలుకు రావాలంటే రెండు రోజుల ప్రయాణం అని బాధపడ్డాడు. అంత కష్టనష్టాలకు ఓర్చి మందులు యిద్దామని వస్తే రోగులు తమకేమీ పట్టనట్లు చాలా నిర్లక్ష్యంగా తీసుకుంటారు. జబ్బు

తగ్గిన వాళ్ళు కూడ సరియైనటువంటి కృతజ్ఞత తెలుపడం లేదుట.

"రామరాజుగారు ! మీ మందు మహిమ వలన నా కిడ్నీ జబ్బు తగ్గిపోయింది. కాని కాళ్ళల్లో నీరు చేరింది– ఒళ్ళొచ్చింది... ఇవి కూడ తగ్గిస్తే బాగుంటుంది... అమ్మ చెప్పింది ఆయన్ను చూసిన ఆనందంలో – గొప్ప విషయం ఏమిటంటే రామరాజు గారు పరిచయం కాని ముందు కిడ్నీకి ఎన్నో మందులు వాడినా ఆమె జబ్బుతో బాధపడుతూ ఉండేది. ఆయన ఇచ్చిన మందుల వలన సంవత్సరాలైనా ఆ జబ్బు తిరగ బెట్టలేదు. వయసుతో పాటు కొంత అనారోగ్యం ఆమెకు కలిగింది. ఆమె పర్‌ఫెక్షనిస్టు ! నూటికి నూరు శాతం ఆరోగ్యం పొందాలనుకుంటుంది. ఆమె మేధావి కాబట్టి తన జబ్బులకు మూలాలు అన్వేషిస్తుంది.

"మీకోసం చాలా గొప్ప మందు తయారు చేశాను. ఆ మందును తీసుకురావడం మరచిపోయాను. నా నెక్ట్స ట్రిప్పులో తీసుకు వస్తాను. అది వాడితే మీరు చలాకీగా నడవగలుగుతారు. మీ ఒళ్ళు తగ్గిపోతుంది – కాళ్ళ వాపులు నయం అవుతాయి." అంటూ వృద్ధాప్యాన్ని అరికట్టే హోమియో మందు కూడ సూచించాడు వారంకు ఒక డోసు వేసుకొమ్మని చెప్పాడు.

అమ్మ చాలా ఆనందపడింది.

అప్పటి నుండి ఆమె రామరాజు కోసం నిరీక్షించ సాగింది.

కర్నూలులోని చాలా మంది రోగులు ఆయనకోసం నాతో పాటు ఎదురుచూడ సాగారు, రామరాజు రాకకోసం నిలువెల్ల కళ్ళు చేసుకుని.

అలా ఉండగా ఒక రోజు ఓ కార్డు ముక్క మా యింటికి వచ్చింది ఒక అపరిచిత దస్తూరితో

దానిలోని విషయం చదివి అర్థం చేసుకుని, నిశ్చేష్టులమయ్యాం ! " రామరాజు గారు మరణించారు "! – పదో రోజు కర్మకు రమ్మని ఉత్తరం అది మా అందరికి పెద్ద ఆశనిపాతం !

రామరాజు మాలో చాలామందికి ఎన్నో వాగ్దానాలు చేశాడు. ముఖ్యంగా తన వైద్యాన్ని నాకు నేర్పిస్తానన్నాడు. తను కట్టబోయే హాస్పిటల్లో మా కర్నూలు మిత్రులంతా మంచి పదవుల్లో ఉంటారని చెప్పాడు. కర్నూలు జిల్లాను ప్రపంచంలోనే ఒక పెద్ద యాత్ర స్థలంగా మారుస్తానన్నాడు. శ్రీశైలం ఆసుపత్రికి అద్భుతమైన గుర్తింపు ప్రపంచవ్యాప్తంగా వస్తుందని ఊరించాడు.

అమ్మలాంటి రోగులకు తన అమృత హస్తాలతో అద్భుతమైన వైద్యం అందించి వారికి బ్రతుకు మీద ఆసక్తి అనురక్తి కలిగించాడు. దీర్ఘకాలిక రోగుల్లో దీర్ఘమైన ఆశలు

కల్పించాలి కాని.... రామరాజు మరణం భారతదేశానికి భారతీయ వైద్య విధానాలకు పిడుగుపాటు! ఎప్పుడో ఒకప్పుడు రామరాజుకు మధుమేహ వ్యాధి నివారణకు నోబుల్ ప్రైజు వస్తుందని ఆశించాను.

రామరాజు ఎలా మరణించింది మాకు మిష్టరీనే ! ఆ కార్డును పట్టుకుని ఎన్నో ఉత్తరాలు రాసినా వాటికి సరియైన జవాబు లభించలేదు ఆ చిరునామా నుండి.

ఒక సారి నాగరాజు ఏవో పనులపైన సర్కారు జిల్లాల వైపు వెళ్ళి అతి కష్టం మీద రామరాజు నివసించిన ఊరు కనుక్కుని వాళ్ళింటికి వెళ్ళాడు. ఎంతో కష్టం మీద అక్కడికి వెళ్ళి ఆయన మరణవార్తకు తన సంతాపం ప్రకటించాడు. అతని ఎంక్వయిరీలో బయటపడింది అంతా. – రామరాజు ఎలా మరణించాడో మిష్టరీ వీగిపోయింది మాకు.

రామరాజు కొన్ని కొత్త మందులు కనిపెట్టి తనపైన ప్రయోగించుకున్నాడు. కొంత అనారోగ్యం పాలయ్యాడు. మందు ప్రభావం తగ్గగానే స్వస్థత చేకూరుతుందని నమ్మాడు. కాని కడుపు బాధలు పెరగడంతో పట్టణం వచ్చి ఆసుపత్రిలో చేరాడు

చేరిన మూడో రోజుకే మరణించాడు.

అతనికి వచ్చింది సిరోసిస్ ఆఫ్ లివర్ ! అట.

సామాన్యుల భాషలో జలోదరం !

అంటే కడుపులో క్యాన్సరు అయింది. అది రావలసి ఉండి వచ్చిందో – లేదా ఆయన మందుల ప్రభావం వలన వచ్చిందో తెలియదు. కాని ఫలానా జబ్బు అని తెల్సుకుని – తన మందులు వాడుకునే సమయం యివ్వకుండా ఆ జబ్బు రామరాజును కబళించేసింది. కొంచెం ముందుగా కనుక్కుని ఉంటే తన జబ్బును తను నయం చేసుకునే వాడినని నర్సులతో చెప్పాడుట !

ఉదయించకుండానే అస్తమించిన సూర్యుడు రామరాజు.

రామరాజు మరణవార్తను ధృవీకరిస్తూ నాగరాజు మోసుకొచ్చిన వార్తలు కర్నూలు వాసులను కన్నీటిలో ముంచెత్తాయి.

అప్పటి దాకా గిట్టని వాళ్ళు ఆయనపైన కార్డు వేశారని నమ్మిన మా అమ్మ నమ్మకం వమ్మయిపోయింది. విలపించింది.

ఆ తరువాత రామరాజు రాసుకున్న నోట్సును ప్రజలకు అందించాలని ఆ నోట్సుకోసం వారి తాలుకు బంధువులతో సంప్రదింపులు జరిపించాను నాగరాజుతో.

కాని షాకింగు న్యూస్ ఏమటింటే ఆయన రాసుకున్న చాలా కాగితాలు చెత్తకాగితాలు ఏరుకునే – అమ్ముకునే వాడికి – చేరిపోయాయట ! ఎంతో అమూల్యమైన పరిశోధన అలభ్యమట !!

మిగతావి కూడ ఎక్కడో దుమ్ముధూళిలో దొర్లుతున్నాయట ఆ పిచ్చి రాతలని వెతికి పట్టుకునే ఓపిక – తీరిక ఎవరికీ లేవట.

ఏతావాతా తేలిందేమంటే రామరాజు వారసులందరికీ అతని రాతలపైన, అతని వైద్యం పైన ఆసక్తి లేదు. అట్లాగని వాటిని ప్రజలకు అంకితం చేసే ఉద్దేశ్యం కూడా లేదు ఎందుకంటే వారంతా సగటు భారతీయులు.

భారతీయుల అలసత్వానికి – మూర్ఖత్వానికి – మన ప్రాచీన తాళపత్రాలు ఎన్నో శిథిలమై పోయాయి. అద్భుతమైన మంత్ర తంత్ర – వైద్య గ్రంథాలు మన పూర్వీకులతోనే అంతరించి పోయాయి. అప్పటి వారి అమాయకత్వానికి మూర్ఖత్వానికి నవ్వుకునే వాడిని. జాలి పడేవాడిని. మన జాతీయ సంపదను నశింప చేసిన వారిపై కోపగించుకునే వాడిని.

కాని ఇప్పుడు భారతీయులకు తెలివితేటలు బాగా పెరిగి పోయాయని – అందునా ఆంధ్రులకు అద్భుతమైన తెలివి తేటలు లౌక్యం వున్నాయని నమ్మేవాడిని. మన విజ్ఞాన సంపదని అలక్ష్యం చేయరని – అందరికి అందుబాటులో తెస్తారని విశ్వసించేవాడిని.

కాని నాకు అర్థమైంది భారతీయులు – అందులో ఆంధ్రులు ఆవగింజంతైనా మారలేదని – వారి స్వార్థం ముందు రామరాజులాంటి బహుముఖ ప్రజ్ఞాశాలులు నీరు కారి పోవలసిందేనని . ఆంధ్రుల అసూయ ముందు ఎంత వారైనా బలికావలసిందే !

" రామరాజు మరణించడం నిజంగా గొప్ప దురదృష్టం ! జ్యోతిష్యంలో ఒక గొప్ప దుస్సంఘటన ! అతను ఆగండం గట్టెక్కితే చరిత్రను మలుపు తిప్పేవాడు". అని స్కంధస్వామి వ్యాఖ్యానించాడు ఆయన్ని సంజాయిషీ అడగంగా నాన్నగారు.

రామరాజు వైద్యంతో మరో జన్మ పొందిన అమ్మ చివరికి కొన్ని సంవత్సరాల తరువాత మంచానపడి ఇంగ్లీషు డాక్టర్లచే సకాలంలో గుర్తింపబడని జబ్బుతో స్వర్గస్తురాలైంది. ఆమె కూడ జలోదరంతో మరణించడం కాకతాళీయమేమో !

రామరాజు బ్రతికి వుంటే ఖచ్చితంగా అమ్మను బ్రతికించేవాడు. ఇంగ్లీషు డాక్టర్లు ఆమె చివరిరోజు వరకు ఆమె జబ్బు కనిపెట్టలేక పోయారు.

అనర్హులు అందలాలు ఎక్కుతూ ఉంటే, అన్ని అర్హతలు కలిగిన రామరాజు గుర్తింపు నోచుకోకుండానే మరణించాడు. అది మన జాతి దురదృష్టం

– రచన నవంబరు 2008